## శ్రీరామనవమికి ఏర్పాట్లు పూర్తి

నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 5: నేడు(ఆదివారం) నిర్వహించనున్న శ్రీరామనవమి వేడుకలకు మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. శ్రీరామ, ఆంజనేయ స్వామి ఆలయాలను సుందరంగా అలంకరించారు. భక్తులకు ఆలయ కమిటీలు వసతులు కల్పించాయి.

## ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి

వాంకిడి, ఏప్రిల్ 5: ట్రాక్టర్ (టీఎస్ 19 టీ 1639) ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి వాంకిడి మండలం సవ్వది గ్రామ సమీపంలో జరిగింది. వాంకిడి ఎస్ఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టీ) మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన మడావి రాజ్ కుమార్(22) 4న వాంకిడి మండలం బంబార గ్రామానికి బంధువుల పెళ్లికి వచ్చాడు. అదే రోజు రాత్రి 7:30 గంటలకు రాజ్‌కుమార్ వాంకిడి నుంచి బైక్ (టీఎస్ 20 డీ 7774)పై బంబార వైపు వెళ్తుండగా వాంకిడి మండలానికి చెందిన ట్రాక్టర్ అతి వేగంగా వస్తూ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రాజ్‌కుమార్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు అక్కడికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసిఫాబాద్ దవాఖానకు తరలించారు. మృతుడి తండ్రి శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ కుమ్మ విజయ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ముగ్గురు బైండోవర్

దహెగాం, ఏప్రిల్ 5: గతంలో నకిలీ పత్తి విత్తనాలతో నిషేధిత గడ్డి మందును అమ్ముతూ పట్టుబడిన ముగ్గురిని శనివారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ కందూరి రాజు తెలిపారు. ఇట్యాల గ్రామ పరిధిలోని గొర్లగుట్టకు చెందిన షాయిక్ జమీర్, మంచిర్యాల జిల్లా భీమిని మండలం ఖర్జీభీమ్‌పూర్‌కు చెందిన వడాయి సుధాకర్, వడాయి నాందేవ్ గతంలో నకిలీ పత్తి విత్తనాలు, నిషేధిత గడ్డి మందును అమ్ముతూ పట్టుబడడంతో వారిపై కేసులు నమోదు చేశామన్నారు. మరోమారు ఇలా చేయకుండా ఉండేందుకు ముందస్తుగా వారిని బైండోవర్ చేశామని పేర్కొన్నారు.

## పాలేరు మృతి ఘటనలో యజమానిపై కేసు

వేమనపల్లి, ఏప్రిల్ 5 : మండలంలోని మంగెనపల్లి గ్రామానికి చెందిన నాయిని కన్నయ్య అనే వ్యక్తి మృతికి కారణమైన ఆ గంటి చిన్నన్న అలియాస్ చిన్నారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు ఆత్మహత్యకు కారణమైనందుకు మరో కేసు నమోదు చేసినట్లు నీల్వాయి ఎస్ఐ శ్యాంపటేల్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం చిన్నన్న అలియాస్ చిన్నారెడ్డి వద్ద కన్నయ్య పాలేరుగా పనిచేస్తున్నాడు. పొలానికి మందు కొట్టే పంపు చెడిపోవడంతో ఎందుకు మరమ్మతులు చేయించలేదని కన్నయ్యను కులం పేరుతో దూషిస్తూ అసభ్య పదజాలంతో తిట్టాడు. దీంతో మనస్తాపం చెందిన కన్నయ్య పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చిన్నన్న అలియాస్ చిన్నారెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## అక్రమ నిర్మాణం కూల్చివేత

బెల్లంపల్లి, ఏప్రిల్ 5 : పట్టణంలోని 170 సర్వేనంబర్ ప్రభుత్వ భూమి షంషీర్‌నగర్ ఏరియాలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాన్ని శనివారం రెవెన్యూ అధికారులు కూల్చివేయించారు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదులు రావడంతో కూల్చివేసినట్లు తహసీల్దార్ జ్యోత్స్న పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల్లో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## పేకాట స్థావరంపై దాడి

బెల్లంపల్లి, ఏప్రిల్ 5 : పట్టణంలోని అశోక్ నగర్ ముక్కెర వెంకటేశ్ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శనివారం దాడి చేసి తొమ్మిది మంది పేకాటరాయుళ్లను పట్టుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు వెంకటేశ్ ఇంట్లో దాడి చేసినట్లు పేర్కొన్నారు. పేకా ఆడుతున్న వెంకటేశ్‌తో పాటు జంగం క్రాంతికుమార్, గొడుగు రమేశ్, తొగరి సురేశ్, యాదగిరి మహేశ్, బాకం సుమన్, గజ్జల స్వామి, ఎరుకల శ్రీనివాస్, సుందరీ మల్లాద్రీని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 52 పేకముక్కలు, ఏడు మొబైల్ ఫోన్‌లు, ఐదు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## మొబైల్ షాప్‌లో చోరీ

రెబ్బెన, ఏప్రిల్ 5: రెబ్బెన మండల కేంద్రంలోని శివమ్ మొబైల్ షాప్‌లో గుర్తు తెలియని దుండగులు మొబైల్‌లు, పలు వస్తువులు ఎత్తుకెళ్లినట్లు రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. రెబ్బెనలో నివాసం ఉంటున్న బండారి రాకేశ్ శివమ్ మొబైల్ షాప్ నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నాడు. 5వ తేదీ శనివారం ఉదయం షాప్ వెనుక తలుపులు తెరిచి ఉండడంతో రాకేశ్‌కు షాప్ పక్కనున్న డాక్టర్ నారాయణ సమాచారం అందించాడు. మొబైల్ షాప్‌లో రిపేరుకు ఇచ్చిన మొబైల్స్ తో పాటు వివిధ రకాల వస్తువులు కనబడలేదు. వీటి విలువ సుమారు రూ.40 వేల వరకు ఉంటుందని తెలిపారు. రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో రాకేశ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెబ్బెన ఎస్ఐ తెలిపారు.

## ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్



బెల్లంపల్లిలో దుర్గం చిన్నయ్య..

నస్పూర్/ఆసిఫాబాద్/మంచిర్యాల అర్బన్/బెల్లంపల్లి, ఏప్రిల్ 5 : ఆసిఫాబాద్, నస్పూర్‌లోని కలెక్టరేట్‌లలో నిర్వహించిన బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేశ్ ధోత్రే పాల్గొన్నారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంచిర్యాల పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో జాతీయ విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేశారు. రామగుండం కమిషనరేట్‌లో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, బెల్లంపల్లిలో పట్టణంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య బాబూ జగ్జీవన్ రాం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయా చోట్ల జిల్లా అధికారులు రవీందర్‌రెడ్డి, దుర్గా ప్రసాద్, కిషన్, వెంకటేశ్వర్‌రావు, రౌఫ్‌ఖాన్, రాజేశ్వరి, ఆసిఫాబాద్ అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, డేవిడ్, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావు, ఆర్ఐ పెద్దన్న, ఆర్. ఎస్ ఐలు రాజేష్, లవన్, సందీప్, కిరణ్, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి సజీవన్, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, జిల్లా విద్యుత్ శాఖ అధికారి శేషరావు, ఎం ఆర్ పి ఎస్ జాతీయ నాయకులు రేగుంట కేశవరావు, సింగిల్ విండో ఛైర్మన్ అలీబిన్ అహ్మద్, డి సి సి అధ్యక్షుడు విశ్వప్రసాదరావు, మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, కుల సంఘాల నాయకులు బ్రహ్మయ్య, రూప్ నార్ రమేష్, నగోషా శంకర్, మారుతి, జయరాజ్, గంగుబాయి, జాతీయ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ, నాయకులు హరీశ్‌గౌడ్, శివతేజ, బెల్లంపల్లి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, పట్టణ ప్రధాన కార్యదర్శి రేవెల్లి విజయ్, యూత్ పట్టణ అధ్యక్షుడు సబ్బని అరుణ్‌కుమార్, నాయకులు అలీ, సాజిద్, వాజిద్, రాజం, సుందర్‌రావు, అస్లాం, ఖలీల్, మద్దెల గోపీ పైడిమల్ల చంద్రశేఖర్, మనీ, అఖిల్, సతీష్ పాల్గొన్నారు.

## అక్రమ కేసులకు భయపడేది లేదు

బెల్లంపల్లి, ఏప్రిల్ 5 : అక్రమ కేసులు, నిర్బంధాలకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు భయపడేది లేదని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య శనివారం ప్రకటనలో స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు భూ కబ్జాలు చేస్తున్నారని సోషల్ మీడియాలో పోస్టు చేసినందుకు బీఆర్‌ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నూనెటి సత్యనారాయణపై క్రిమినల్ కేసు నమోదు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల ముందు విలువైన స్థలాన్ని కొంతమంది కాంగ్రెస్ నాయకులు కబ్జా చేస్తున్నారని, అట్టి స్థలం కబ్జా కాకుండా సంబంధిత అధికారులు చొరవచూపాలని పోస్టు చేయడంలో తప్పేమిటని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడానికి 24 గంటలు అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు.

## 'కుల వృత్తిదారులకు కాంగ్రెస్ అన్యాయం'

మంచిర్యాల (ఏసీసీ), ఏప్రిల్ 5: కుల వృత్తులు చేసుకుని జీవించే వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నేతలు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం వస్తే కుల వృత్తుల ఫెడరేషన్లకు నిధులు ఇస్తారని భావిస్తే, కాంగ్రెస ప్రభుత్వం మోసం చేస్తున్నదని ఆరోపించారు. దీన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో గల తెలంగాణ తల్లి విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఒక్కో బీసీ ఫెడరేషన్ రూ.500 కోట్లు విడుదల చేయాలని, కొత్తగా ఏర్పాటు చేసిన బీసీ కార్పొరేషన్ కి రూ.2 వేల కోట్ల నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. గుమ్ముల శ్రీనివాస్, లచ్చన్న, రమేశ్, శాఖపూరి భీంసేన సతీశ్ పాల్గొన్నారు.

## కలెక్టర్ చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌లు అందజేత

నస్పూర్, ఏప్రిల్ 5 : ఫిబ్రవరి 3న నిర్వహించిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పరీక్షలో శ్రీచైతన్య మంచిర్యాల బ్రాంచ్ విద్యార్థులు రాణించి ల్యాప్‌టాప్‌లు కైవసం చేసుకున్నారు. 7వ తరగతి విద్యార్థి సంశ్రేయ్ పరీక్షలో ప్రతిభ కనబర్చగా శనివారం కలెక్టర్ కుమార్ దీపక్ చేతుల మీదుగా ల్యాప్‌టాప్ అందుకున్నాడు. ఏజీఎం అరవింద రెడ్డి, కో ఆర్డినేటర్ నాగరాజు, ప్రిన్సిపల్ ఆయూబ్, నాగేశ్వర్‌రావు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు. విద్యార్థిని స్కూల్ చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, రాష్ట్ర సమన్వయకర్త జయరాజ్ అభినందించారు.

## చిన్నారుల కంటి పరీక్షలకు ప్రణాళిక సిద్ధం

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 5: జిల్లాలో 969 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని ఆరేళ్లలోపు 37920 మంది చిన్నారులకు ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కంటి పరీక్షలు చేయనున్నట్లు డీఎంహెచ్‌వో హరీశ్ రాజు తెలిపారు. ఆదివారం జిల్లా వైద్యాధికార్యాలయంలో వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎనిమిది ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా వైద్యులు అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి కంటి వ్యాధులపై పరీక్షలు చేస్తారని తెలిపారు. ఉప జిల్లా వైద్యాధికారి అనిత, నోడల్ ఆఫీసర్ ఆర్‌బీఎస్‌కే శంకర్, ఆప్తాలమిక్ అధికారి భాస్కర్ రెడ్డి, జిల్లా మాస్‌మీడియా అధికారి వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కన్నెపల్లి, ఏప్రిల్ 5 : కన్నెపల్లి, భీమిని మండలాల్లో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ శనివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కన్నెపల్లి మండలంలోని చర్లపల్లి గ్రామంలో నిర్మించిన అదనపు గదులను ప్రారంభించారు. జన్కాపూర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ కోసం భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కన్నెపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం నాయకుడిపేటలో మొక్కంపల్లిలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ప్రాథమిక పాఠశాలను ప్రహరీని ప్రారంభించారు. భీమిని మండల కేంద్రంలో సిబ్బందికి నివాస భవనాలను ప్రారంభించారు. కన్నెపల్లి మండలంలోని టేకులపల్లి, భీమిని మండలంలోని మల్లీడి గ్రామాలు పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక కాగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో శంకర్, భీమిని తహసీల్దార్ వికారాబాద్, గంగా మోహన్, డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్, నాయకు లు మాధవరపు నర్సింగరావు, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

## దుబ్బగూడెంలో బోర్ మోటర్ ఏర్పాటు

కాసిపేట, ఏప్రిల్ 5 : కాసిపేట మండలంలోని కల్యాణిఖని ఓపెన్ కాస్ట్ నిర్వాసిత గ్రామమైన దుబ్బగూడెంలోని హనుమాన్ ఆలయం వద్ద శనివారం సింగరేణి ఆధ్వర్యంలో నీటి బోర్‌కు మోటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు జీఎం దేవేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు గోనెల శ్రీనివాస్, బూరుగుపల్లి రమేశ్, దుర్గం శ్రీనివాస్, బోగె రామకృష్ణ, నాగపూరి శ్రీనివాస్, మహేందర్, ఎండీ రఫీ ఉన్నారు.

## బోర్‌వెల్ పంపుసెట్ విరాళం

మందమర్రి రూరల్, ఏప్రిల్ 5: మండలంలోని వెంకటాపూర్‌లోని ఆర్కే5 కాలనీ ప్రజల నీటి ఇబ్బందులు తీర్చేందుకు హ్యాండ్ బోర్‌కు పంప్ సెట్‌ను కొట్టె సంపత్ విరాళం శనివారం అందించారు. మాజీ వార్డు సభ్యుడు తండ్రి కొట్టె రాజయ్య పటేల్ జ్ఞాపకార్థం గ్రామంలో ఆర్కే 5 కాలనీలోని హ్యాండ్ బోర్‌కు రూ.20వేల విలువైన పంప్ సెట్‌ను కొట్టె సంపత్ అందించారు. ఈ సందర్భంగా సంపత్‌ను గ్రామస్తులు అభినందించారు.

## పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం

నస్పూర్, ఏప్రిల్ 5 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఏసీసీలో గల కార్మెల్ కాన్వెంట్ పాఠశాలలో పదవ తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం కేంద్రం ఏర్పాటు చేసినట్లు డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూల్యాంకనం ఉంటుందన్నారు.

# ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి



హాజీపూర్ : గుడిపేటలోని పోలీస్ బెటాలియన్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు



కాగజ్‌నగర్‌లో..

నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 5: స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘసంస్కర్త, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ 118వ జయంతి వేడుకలను శనివారం మంచిర్యాలలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అధికారులు, నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, అధ్యక్షుడు గోగర్ల ఆశయ్య, బూడిద శ్యాంకుమార్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు. మంచిర్యాలలోని బాయ్స్ హై పాఠశాల మైదానంలో కుమ్రం భీం సేవా సమితి ఆధ్వర్యంలో, నస్పూర్‌కాలనీలోని బీఆర్‌ఎస్ పట్టణ పార్టీ కార్యాలయంలో, దండేపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద , ఎంపీడీవో కార్యాలయంలో, మంచిర్యాల టీఎన్జీవో భవన్‌లో, గుడిపేటలోని టీజీఎస్‌పీ 13 వ బెటాలియన్‌లో, జన్నారంలో అంబేద్కర్ భవనంలో బాబూ జగ్జీవన్‌రాం జయంతిని నిర్వహించారు. చెన్నూర్‌లో ఎమ్మార్పీఎస్ (టీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి తగరం మధురాజ్, జిల్లా అధికార ప్రతినిధి వడ్లకొండ పర్వతాలు, మండల అధ్యక్షుడు ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు శ్యాంసుందర్, నాయకులు రాజయ్య, తదితరులు పాల్గొన్నారు. కోటపల్లి తహసీల్, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో, క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో, మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో, లెదర్ పార్క్ ఏర్పాటుకు నిర్మించిన భవనం వద్ద, మందమర్రి ఎంపీడీవో కార్యాలయంలో, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో జయంతి వేడుకలను నిర్వహించారు. తాండూర్ ఎంపీడీవో, తహసీల్ కార్యాలయాల్లో జయంతి వేడుకలు నిర్వహించారు. కాసిపేట మండల పరిషత్ కార్యాలయంలో జయంతి వేడుకలు నిర్వహించారు.

**కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో..**

రెబ్బెన మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఆర్ఐ ఉదయ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు. కెరమెరిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మహ్మద్ అఫ్జద్‌పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అధికారులు పాల్గొన్నారు. జైనూర్ మండల కేంద్రంలో, సిర్పూర్(యూ)లో తహసీల్ కార్యాలయంలో జయంతి వేడుకలను నిర్వహించారు. కాగజ్‌నగర్‌లో పీఆర్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఏటూకూరి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గం కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, సంజీవయ్యకాలనీ వాసులు పాల్గొన్నారు. బెజ్జూర్ తహసీల్ కార్యాలయంలో, కౌటాలలోని తలోడి క్రాస్ రోడ్డు వద్ద గల బాబు జగ్జీవన్ రాం విగ్రహం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఆర్సీలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో, అధికారులున్నారు.

## సన్న బియ్యాన్ని పక్క దారి పట్టిస్తే కఠిన చర్యలు

• మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూర్ రూరల్, ఏప్రిల్ 5: ప్రజలకు అందించాల్సిన సన్న బియ్యాన్ని పక్క దారి పటిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ హెచ్చరించారు. చెన్నూర్ మండలంలోని కిష్టంపేట గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే వివేక్‌తో కలిసి ఆయన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. లబ్ధిదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేయాలని తెలిపారు. రేషన్ డీలర్లు ఎలాంటి అవకతవకలకు పాల్పడినా డీలర్ షిప్ రద్దు చేస్తామని హెచ్చరించారు. రేషన్ దుకాణాలను తెరువాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కరుణసాగర్ రావు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలున్నారు.



బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

### రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

కోటపల్లి, ఏప్రిల్ 5 : కోటపల్లి మండలంలో పలు అభివృద్ధి పనులను చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ ప్రారంభించారు. కోటపల్లి, బ్రాహణపల్లి, నక్కలపల్లి గ్రామాల్లో నూతన సీసీ రోడ్డు నిర్మాణాలను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. బొప్పారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ప్రారంభించి గ్రామస్తులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, తహసీల్దార్ రాఘువేంద్రరావ్, ఎంపీడీవో లక్ష్మయ్య, నాయకులు కేవి ప్రతాప్, మహేశ్ ప్రసాద్ తివారీ, భూషణ శర్మ, దుర్గం వెంకటస్వామి, సీతరాంరెడ్డి, కాట్రాల మల్లయ్య, శ్రావణ్, తోట అశోక్, జెల్ల వెంకటస్వామి, జెల్ల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే బంగారు భవిష్యత్

• సింగరేణి శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్



విద్యార్థులతో శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్, సింగరేణి అధికారులు

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 5: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే విద్యలో రాణిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం సీసీసీ సింగరేణి పాఠశాలలో పూర్వ విదాఇర్థుల సంఘం ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్, కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీఎం ముఖ్యాతిథిగా హాజరై మాట్లాడుతూ సింగరేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యాబోధన అందిస్తున్నట్లు చెప్పారు. పాఠశాల దశ నుంచే విద్యార్థుల భవిష్యత్ ప్రారంభమవుతుందని ప్రతి విద్యార్థీ క్రమశిక్షణతో కూడిన విద్యను కొనసాగించాలని సూచించారు. టెన్త్ తర్వాత విద్యార్థులు నిష్ణాతుల సలహాలు తీసుకుని కోర్సులను ఎంపిక చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అరవిందరావు, పాఠశాల కరస్పాండెంట్ రాజేశ్వర్, హెడ్‌మాస్టర్ సంతోష్, డైట్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ చంద్రప్రకాశ్‌రెడ్డి, జేసీఐ నేషనల్ ట్రైనర్స్ ప్రవీణ్‌కుమార్, శాంతన్, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు సమ్మయ్య, వాణిశ్రీ, రాజారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీపీపీ ఈడీగా చెన్న కేశవుల చిరంజీవి బాధ్యతల స్వీకరణ



ఈడీకి స్వాగతం పలుకుతున్న జీఎం శ్రీనివాస్

జైపూర్, ఏప్రిల్ 5: ఎస్టీపీపీ ఈడీగా (ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్) చెన్న కేశవుల చిరంజీవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన రాజశేఖర్ కొన్ని రోజుల క్రితం బదిలీపై వెళ్లగా జీఎం శ్రీనివాసులు ఇన్‌చార్జి ఈడీగా పని చేస్తున్నారు. జార్ఖండ్ రాష్ట్రంలోని ఎన్‌టీపీసీలో ఏజీఎం ఓఅండ్‌ఎంగా పనిచేస్తున్న చిరంజీవి డిప్యూటేషన్‌పై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఈడీకి అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జీఎం శ్రీనివాసులు, చీఫ్ ఆఫ్ ఓఅండ్‌ఎం జైన్‌సింగ్, సీఎంవోఐ బ్రాంచ్ అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్, ఏజీఎం ఫైనాన్స్ మురళిధర్, డీజీఎం పర్సనల్ అజ్మీరా తుకారాం తదితరులు పాల్గొన్నారు.

## వాలీబాల్ టోర్నీ విజేత హైదరాబాద్ జట్టు




విన్నర్‌గా నిలిచిన హైదరాబాద్ జట్టుకు బహుమతులు అందించిన బెల్లంపల్లి జీఎం విజయభాస్కర్

రెబ్బెన, ఏప్రిల్ 5 : బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్‌లో గల భీమన్న క్రీడామైదానంలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన 36వ వేణుగోపాల్ మెమోరియల్ ఇన్విటేషనల్ వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతగా హైదరాబాద్ జట్టు నిలువగా, రన్నర్‌గా బెల్లంపల్లి జట్టు నిలిచింది. ఫైనల్‌లో బెల్లంపల్లి జట్టుపై హైదరాబాద్ జట్టు గెలిచి విజేతగా నిలువగా ముఖ్య అతిథిగా హాజరైన బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్ రెడ్డి విజేత జట్టుకు కప్‌తో పాటు రూ.30వేల నగదు బహుమతి, రన్నర్ జట్టు కు కప్పుతో పాటు రూ.20వేల నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం మాట్లాడుతూ క్రీడలతో శారీరకంగా ఆరోగ్యంతో పాటు మానసికంగా ప్రశాంతత చేకురుతుందన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో రాణించి పతకాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్‌బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డి మల్ల తిరుపతి, సీనియర్ పీవోలు శ్రీనివాస్, ప్రశాంత్, ఆర్జీ–2 ఏరియా స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి, బెల్లంపల్లి రీజియన్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ కిరణ్‌బాబు, క్రీడల జనరల్ కెప్టెన్ చంద్రకుమార్, తదితరులున్నారు.

## కాసిపేట గనిపై జగ్జీవన్ రామ్ జయంతి

కాసిపేట, ఏప్రిల్ 5 : మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై బాబు జగ్జీవన్ రామ్ జయంతిని బన్న లక్ష్మణ్‌దాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ భారత ఉప ప్రధాని గా పని చేసి, 45 సంవత్సరాలు పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నారన్నారు. మేనేజర్ భూశంకరయ్య మాట్లాడుతూ పాక్ పై యుద్ధం జరిగినప్పుడు రక్షణ మంత్రిగా ఉన్నారని, అప్పుడే బంగ్లాదేశ్ ఏర్పడడానికి నాంది ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ దాగం మల్లేశ్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కనుకుల తిరుపతి, ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బన్న లక్ష్మణ్‌దాస్, నాగేశ్వరరావు, జనార్ధన్ రెడ్డి, సర్వేయర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం



మందమర్రి కేకే 5గని మేనేజర్లను సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

మందమర్రి ఏప్రిల్ 5: సింగరేణి మందమర్రి ఏరియాలోని కేకే 5గని మేనేజర్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్‌తో పాటు నూతనంగా బదిలీపై వచ్చిన గని మేనేజర్ శంభునాథ్ పాండేను గనిపై శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. బదిలీ వెళ్తున్న అధికారి ప్రవీణ్ ఫాటింగ్‌కు వీడ్కోలు పలికిన నాయకులు కొత్తగా వచ్చిన మేనేజర్ శంభునాథ్ పాండేకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో బదిలీలు, ఉద్యోగోన్నతులు సహజమన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, కేంద్ర నాయకులు జే.రవీందర్, ఓ.రాజశేఖర్, సారయ్య, పిట్ కార్యదర్శి వీరారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బొడ్డు మల్లేశ్, శివ నాయక్, కొప్పు శ్రీనివాస్, పోలు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

**బదిలీపై వెళ్తున్న ఓవర్మెన్‌కు సన్మానం**

కాసిపేట, ఏప్రిల్ 5 : మందమర్రి ఏరియాలోని కాసిపేట 2 ఇంక్లైన్ గని సేఫ్టీ ఓవర్మెన్ సెగ్గం శ్రీనివాస్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా టీబీజీకేఎస్, ఎస్సీ, ఎస్టీ సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. గనిపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు ప్రతాప్ సారంగపాణి, వెంకటేశ్, సింగతి కృష్ణ, యాదగిరి, సత్య ప్రసాద్, రాజ్ కుమార్, తిరుపతి, అర్జున్, పసిక వెంకటేశ్, మేకల రమేశ్, కుమార్, మహణమ, శ్రీను, విశాల్, మారం రమేశ్, ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకులు కండె నవీన్, నాయిని శ్రీనివాస్, కనకం రమేశ్, ఆవునూరి రవి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మోసాలను ఎండగడుదాం

• బీఆర్‌ఎస్ సిర్పూర్ మండల అధ్యక్షుడు తొడసం ధర్మారావు



డైరీలు ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సిర్పూర్(యూ), ఏప్రిల్ 5: మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలందరం కలిసి కాంగ్రెస్ పార్టీ మోసాలను ఎండగడుదామని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తొడసం ధర్మారావు, జైనూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావులు పిలుపు నిచ్చారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ డైరితో పాటు క్యాలెండర్ ఆవిష్కరించారు. మండలంలో ఇప్పటి వరకు బీఆర్‌ఎస్ సర్కారు ప్రవేశపెట్టిన పథకాలే నడుస్తున్నాయన్నారు. అనేక మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేసి అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ చేసింది ఏం లేదన్నారు. రైతు బంధు, రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయలేదన్నారు. నేటికి గ్రామాల్లో మిషన్ భగీరథ నీరే ఆధారమైందన్నారు. కాంగ్రెస్ చేసిన మోసానికి ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. తమ పార్టీ, తమ ముఖ్యమంత్రిని చేసిన అభివృద్ధిని ప్రజలు ఇప్పుడు గుర్తు చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కేంద్రే శివాజీ, తాజా మాజీ ఎంపీపీ తొడసం భాగ్యలక్ష్మి, మాజీ సర్పంచులు, నాయకులు అర్క నాగోరావు, రాజేశ్వర్ కోవ నాందేవ్, అర్జున్, ప్రహ్లాద్, కుమ్ర భీంరావు, మాధవరావు నాయకులు, కార్యకర్తలున్నారు.

## వాటర్ షెడ్ పథకాన్ని సద్వినియోగం చేయాలి

కెరమెరి, ఏప్రిల్ 5: గ్రామాల్లో మంజూరైన వాటర్ షెడ్ పథకాని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మహ్మద్ అఫ్జద్‌పాషా అన్నారు. శనివారం మండలంలోని ఎంపికైన పరందోలి, ఇందాపూర్ గోండ్‌గూడలో పథకాన్ని ప్రారంభించారు. వ్యవసాయ అభివృద్ధికి అవసరమైన చోట నీటికుంటలు, పండ్లతోటలు వంటి అనేక పనులు చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం గ్రామాల్లో శ్రమదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, జీపీ ప్రత్యేక అధికారి విశ్వేశ్వర్‌రావ్, ప్లాంటేషన్ మేనేజర్ ఆంజనేయులు ఈజీఎస్ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

## కళాకారులకు ఉపాధి కల్పిస్తాం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 5: జిల్లాలో అనేక మంది కళాకారులు ఉన్నారని వారిలో ప్రతిభను వెలికి తీసి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు టీవీ ఫెడరేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు నాగబాల సురేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పిక్చర్ టైం థియేటర్‌లో ఔత్సాహిక కళాకారులతో నిర్వహించిన సమావేశంలో యువ దర్శకుడు దండనాయకుల మానస్‌తో కలిసి మాట్లాడుతూ జిల్లాలో అనేక ప్రకృతి వనరులు ఉన్నాయని వీటిని సద్వినియోగం చేసుకుంటే సినిమా సీరియల్స్ షూటింగ్‌కు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఇక్కడి పర్యాటక ప్రాంతాలను ప్రభుత్వం అభివృద్ధి చేయాలని కోరారు. ఇప్పటికే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 110 మందిని బుల్లి తెరకు పరిచయం చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మందికి అవకాశాలు కల్పిస్తానని తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వం స్థలం కేటాయిస్తే స్టూడియో ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రితో పాటు, సినిమా ఇండస్ట్రీ చైర్మన్ దిల్ రాజు దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. పిక్చర్ టైం థియేటర్ లో సురేశ్ కుమార్ దర్శకత్వంలో తీసిన కుమ్రం భీమ్ చరిత్ర 'వీరభీమ్' చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో యువ డైరెక్టర్ మానస్, నవజ్యోతి సాంస్కృతిక సారథి అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు, సభ్యులు రాధాకృష్ణ చారి, జిల్లాలోని వివిధ మండలాల కళాకారులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

పెంచికల్ పేట్, ఏప్రిల్ 5 : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కొమురయ్య అన్నారు. శుక్రవారం రాత్రి ఎర్రగుంట గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కళాజాత బృందంతో ప్రజలకు అవగాహన కల్పించారు. యువత వ్యసనాలకు దూరంగా చదువు, క్రీడలపై దృష్టి సారించాలని ఆయన అన్నారు. గుడుంబా మద్యం గ్రామాల్లో కేసులు నమోదు చేస్తామని మెచ్చరించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలన్నారు. మూఢనమ్మకాలు, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలు, ఫోక్సో కేసుల పర్యావసనాలు, సీసీ కెమెరాల ఉపయోగాలపై అవగాహన కల్పించారు.

## బావిలో పడి వృద్ధుడి మృతి

కౌటాల, ఏప్రిల్ 5 : మండల కేంద్రంలోని కోయగూడలో గుర్లె ఇస్తారి (80) గ్రామంలోని ప్రభుత్వ బావిలో పడి శనివారం వేకువ జామున మృతి చెందాడు. గత కాలం ఇస్తారి అనారోగ్యంతో బాధపడుతున్నట్లు, జీవితంపై విరక్తి చెంది తెల్లవారు జామున బావిలో పడి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుకర్ తెలిపారు..

## పెన్‌గంగలో గుర్తు తెలియని మృతదేహం

సిర్పూర్ (టీ) మండలం టోంకిని గ్రామ సమీపంలోని పెన్‌గంగా నదిలో గుర్తు తెలియని మృతదేహం నీటిలో తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ కమలాకర్ అక్కడికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మృతుడికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని, సంబంధికులు ఎవరైనా ఉంటే సిర్పూర్ (టీ) పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

## సన్నబియ్యం పంపిణీ

రెబ్బెన, ఏప్రిల్ 5:రెబ్బెన మండల కేంద్రంలోని శంకర్‌లాల్ జైస్వాల్ రేషన్‌షాపు లో శనివారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని రెబ్బెన తహసీల్దార్ రామ్మోహన్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు ఉదయ్‌కుమార్, సౌమ్య, పంచాయితీ కార్యదర్శి రవీందర్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్‌గౌడ్, గౌడ సంఘం మహిళా అధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కుందారపు శంకరమ్మ, మాజీ సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, మాజీ ఉపసర్పంచ్ బొమ్మినేని శ్రీధర్, నాయకులు మోడెం చిరంజివిగౌడ్, అజయ్‌జైస్వాల్, అన్నపూర్ణ మురళీగౌడ్, తదితరులున్నారు.

## గంజాయి పట్టివేత

కెరమెరి, ఏప్రిల్ 5: మండలంలోని ధనోర గ్రామ పంచాయతీ పరిధిలోని తుమ్మగూడ గ్రామంలో గంజాయి పట్టుకున్నామని ఎస్ఐ విజయ్ తెలిపారు. శనివారం విశ్వసనీయ సమాచారం మేరకు పుష్లక తుకారాం ఇంటి వద్ద సోదాలు చేయగా 0.255 కేజీల నిషేధిత గంజాయి లభించిందన్నారు. దీని విలువ సుమారు రూ. 6375 ఉంటుందని ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ

నెన్నెల, ఏప్రిల్ 5: మండలంలోని ఆదర్శ గ్రామం అయిన జంగాల్‌పేటలో 200 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, నిర్మాణ పనులను అధికారులు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్, మాజీ ఎంపీటీసీ గొలులసుల శిరిష, ఏపీవో నరేశ్, ఎంపీవో శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.